www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 17 జూన్ 2025
5
చిత్తూరు

మోసం చేశారు..

- ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి
- లేకుంటే సంక్షేమ పథకాలు అమలు చేయాలి
- ప్రభుత్వ నిర్లక్ష్య తీరుకు నిరసన
- అంగన్వాడీల ధర్నాతో దద్దరిల్లిన కలెక్టరేట్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: అంగన్‌వాడీలకు కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేసిందని, తమను వెంటనే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని లేదంటే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన అంగన్‌వాడీల ధర్నాతో కలెక్టరేట్ దద్దరిల్లింది. అనంతరం తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జాయింట్ కలెక్టర్ కి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు లలిత, షకీలలు మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి పెద్దలు చిరుద్యోగులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని మ్యానిఫెస్టోలో పేర్కొని నేడు అధికారంలోకి రాగానే అంగన్‌వాడీలను మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సాధికార సర్వేలో ప్రభుత్వ ఉద్యోగులుగా అంగన్‌వాడీలను నమోదు చేసి తప్పుచేశారని, ఇప్పటికే పని గంటల పెంచి విపరీతమైన పని ఒత్తిడిని పెంచారని గుర్తుచేశారు. అంగన్‌వాడీ ఆయాకు రూ.7 వేలు, టీచరుకు రూ.11,500 చెల్లిస్తూ ప్రభుత్వ ఉద్యోగులని చెప్పడానికి కూటమి ప్రభుత్వానికి సిగ్గు అనిపించడం లేదా?' అని ప్రశ్నించారు. అంగన్‌వాడీ కుటుంబంలో పిల్లలకు తల్లికి వందనం వేయకపోవడమే కాకుండా ఇంట్లోని వృద్ధులకు వృద్ధాప్య పింఛను ఆపేశారని, భర్త చనిపోయిన వారికి వితంతు పింఛన్లు ఇవ్వడంలేదని, వికలాంగులైన కుటుంబ సభ్యులకు వికలాంగ పింఛను కూడా నిలుపుదల చేశారని, ఇస్తున్న వేతనం కూడా అంగన్‌వాడీ సెంటర్లోని పిల్లలకు వండి పెట్టేందుకు, సెంటర్ అద్దెలకు పెట్టుబడి పెడుతూ పిల్లలతో పస్తులు ఉండాల్సి వస్తోందన్నారు. 2019లో మోడీ ప్రభుత్వం అంగన్‌వాడీలకు వేతనాల్లో కేంద్ర వాటాని పెంచుతానని వాగ్దానం చేసి ఆరేళ్లు అవుతున్నా ఒక్క రూపాయి కూడా పెంచలేదని, ధరలు మాత్రం ఎవరెస్టు శిఖరాన్ని దాటుతున్నాయన్నారు. రాబోయే రోజుల్లో వేతనాల పెంపుకోసం, సంక్షేమ పథకాలు అమలు కోసం పెద్ద ఎత్తున పోరాటానికి అంగన్‌వాడీలు సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు గిరిధర్ గుప్తా, ప్రధాన కార్యదర్శి సురేంద్రన్, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకుల విజయ, సుజని, ధనకోటి, ప్రమీల, సరళ, కస్తూరి, జమున, లీలా పాల్గొన్నారు.

కలెక్టర్ వద్ద ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

మా ఊరి బడులు మార్చొద్దు..

- ప్రభుత్వ నిర్ణయంపై గ్రామస్తుల ఆగ్రహం
- కలెక్టరేట్ వద్ద జిడి నెల్లూరు వాసుల నిరసన

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: అధికారంలోకి వచ్చిన వెంటనే తల్లికి వందనం పేరుతో కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ 15 వేల రూపాయలు ఇస్తామన్న కూటమి ప్రభుత్వం విద్యార్థుల తల్లులకు మంచి చేయడం సంగతి సరే.. ఊరి బడులను దూరంగా మార్చి ప్రభుత్వ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేయడం ఏమిటి?' అని ప్రశ్నిస్తూ ఈ విధానం విరమించుకోవాలని ప్రభుత్వ పాఠశా లల్లో చదువుతున్న విద్యార్థుల తల్లి దండ్రులు కోరుతున్నారు. 'మా ఊరి బడులు మార్చొద్దు..' అంటూ ఆందోళన లు, నిరసనలకు దిగుతున్నారు.

సోమవారం చిత్తూరు కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్సి రిజర్వుడు జీడీ నెల్లూరు నియోజక వర్గంలో నుండి మూడు గ్రామాల దళితులు తమ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల తరగతు లను తగ్గించి తమ పిల్లలను మరో ప్రాంతంలోని పాఠశాలలకు పంపుతున్నారు ఏమిటీ?' అని ప్రశ్నిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. 20,25 సంవత్సరాలుగా తమ గ్రామాల్లో నడుస్తున్న ప్రభుత్వ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను మోడల్ పాఠశాలల పేరుతో మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మరో పాఠశాలకు ఎందుకు మార్చారు?' అని ప్రశ్నించారు. రోజువారి కూలీలు, రైతు కూలీలైన తాము తమ పిల్లల్ని మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలకు పంపడం ఇబ్బందికరంగా ఉంటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. ఈ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో తరగతి గదుల కుదింపు మాను కోవాలని సూచించారు.

మా ఊరి బడి మా ఊర్లోనే ఉండాలి

'మా ఊరి బడి మా ఊర్లోనే ఉండాలి..' అంటూ సోమవారం కలెక్టరేట్ వద్ద జీడీ నెల్లూరు మండలం నుండి పెద్ద సంఖ్యలో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఆందోళన చేశారు. జీడీ నెల్లూరు మండలం యనమల మంద పంచాయతీ వెంకటాపురం గ్రామస్తులు తమ గ్రామంలో ఒకటో తరగతి నుండి 8వ తరగతి వరకు ఉన్న పాఠశాలను ఒకటి నుండి 5వ తరగతి వరకు కుదించి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆళ్ళ మంద గ్రామానికి మార్చడం ఇబ్బందికరంగా ఉందంటూ కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. తమ ఊరిలోని పాఠశాలను కొనసాగిం చాలని ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశా లకు మార్చడం వల్ల విద్యార్థులు చదువుకు దూర మయ్యే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎలాంటి సమాచారం లేకుండా మార్చేశారు..

తమ గ్రామంలోని పాఠశాలను పాఠశాల అభివృద్ధి కమిటీ స్థానిక ప్రజాప్రతి నిధు లకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా మార్చేశారంటూ జీడీ నెల్లూరు మండలం నెల్లేపల్లి పంచాయతీ కొత్తూరు దళితవాడకు చెందిన గ్రామ స్తులు విద్యార్థులతో పాటు కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఒకటో తరగతి నుండి 5వ తరగతి వరకు ఉన్న తమ గ్రామంలోని ప్రభుత్వ ప్రభుత్వ పాఠశాలను మూడు నాలుగు ఐదు తరగతులను మూడు కిలోమీటర్ల దూరంలోని నెల్లెపల్లికి మార్చడం ఏమిటని ప్రశ్నించారు. అక్షయ అనే విద్యార్థి మూడవ తరగతి చదువుతోందని ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న విద్యార్థినికి మూడు పూటలా వైద్యుల సూచన మేరకు మాత్రలు, కోత మందు అందించాల్సి ఉంటుందని కూలి పని చేసుకునే తాను ఊర్లో ఉండి బడిలో చదువుతున్న తన కూతురికి మాత్రలు, మందులు అందిస్తూ ఉండేవారిమని, మూడు కిలోమీటర్లు ఉన్న మరో బడికి మార్చడం వల్ల తన కుమార్తె విద్యకు దూరమయ్యే అవకాశం ఉందని విద్యార్థి తల్లి సుకన్య ఆవేదన వ్యక్తం చేశారు. తాము పాఠశాల అభివృద్ధి కమిటీలో సభ్యులుగా ఉన్నా ఎలాంటి సమాచారం ఇవ్వలేదని మేరీ చంద్రిక తెలిపారు.

నిరసన వ్యక్తం చేస్తున్న మూడు గ్రామాల ప్రజలు

చదువుకు దూరమైన పిల్లలు

తమ గ్రామంలోని ఐదో తరగతి వరకు ఉన్న ప్రభుత్వ పాఠశాలను మూడు కిలోమీటర్ల దూరంలోని మరో పాఠశాలకు మార్చడంతో తమ గ్రామంలోని పిల్లలు చదువుకు దూరమయ్యారని జీడీ నెల్లూరు మండలం పాత వెంకటాపురం పంచాయతీ అగ్రహారం దళితవాడకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు జిల్లా కలెక్టరేట్‌ను ఆశ్రయించారు. విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా తమ గ్రామంలోని ఐదవ తరగతి వరకు ఉన్న ప్రభుత్వ పాఠశాలను సమీపంలోని మరో గ్రామానికి మూడు, నాలుగు, ఐదు తరగతులను మార్చి వేయడంతో తమ గ్రామంలోని పాఠశాలలో చదువుతున్న 30 మంది పిల్లలు పాఠశాల పున ప్రారంభం నుండి మరో గ్రామానికి చదువుకోవడానికి వెళ్లడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను కొనసాగించాలని ఇందుకు ప్రభుత్వం స్పందించాలని కోరారు.

నగరపాలక కార్యాలయంలో వినతుల స్వీకరణ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరపాలక కార్యా లయంలో సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' నిర్వ హించారు. కార్యక్ర మంలో భాగంగా కమిషనర్ పి నరసిం హ ప్రసాద్ ప్రజల నుంచి స్వయంగా వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజలు తెలిపిన సమస్యల పరిష్కారాన్ని అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని సంబంధిత ఖాధికారులను ఆదేశించారు. పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అందే వినతులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరించాలని, సంబంధిత నివేదికలను సకాలంలో సమర్పించాలని ఆదేశించారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఇంజనీరింగ్ శాఖకు 3, రెవెన్యూ 2, ప్రధాన కార్యాలయం 2, పింఛనుకు 1 చొప్పున మొత్తం ఎనిమిది వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌వో డాక్టరు లోకేష్, ఎంఈ వెంకటరామి రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవ
దుబాయ్ నుంచి స్వస్థలానికి యువకుడు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : ఎడారి దేశంలో చిక్కుకున్న యువకుడికి చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ అండగా నిలిచారు. దుబాయ్ నుంచి సురక్షితంగా యువకుడిని చిత్తూరుకి రప్పించారు. సురక్షితంగా ఇల్లు చేరడంతో దిలీప్ సోమవారం చిత్తూరు ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చిత్తూరు చెర్లోపల్లికి చెందిన దిలీప్ మాట్లాడుతూ..మెకానిక్ ఉద్యోగం ఇప్పిస్తామని కొన్ని నెలల క్రితం దుబాయ్ పంపారని.. తీరా అక్కడికి వెళ్లాక వెట్టిచాకిరీ పనులు చేయించారని, సరైన తిండి పెట్టకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు చెప్పాడు. ఈ పరిస్థితుల్లో తనను కాపాడాలని స్థానిక టిడిపి నాయకుల ద్వారా చిత్తూరు ఎమ్మెల్యేని సంప్రదించామన్నారు. ఎమ్మెల్యే స్పందించి దుబాయ్‌లోని ఇండియన్ ఎంబసీతో మాట్లాడి దిలీప్‌ను సురక్షితంగా స్వదేశానికి రప్పించారు. తనను సురక్షితంగా రప్పించిన ఎమ్మెల్యేకి దిలీప్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏజెంట్ల మాయ మాటలు నమ్మి లక్షలు ఖర్చు ఖర్చు చేసి మోసపోతున్నారని, ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. సరైన పత్రాలతో, ప్రభుత్వ శాఖల ద్వారా మాత్రమే విదేశాలకు వెళ్లేందుకు ప్రయత్నాలు చేయాలన్నారు.

20న వేలం పాట

శిథిలావస్థకు చేరుకున్న హాస్టల్ భవనాలు

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండలంలోని కమ్మ నపల్లి గురుకుల పాఠశాలలో శిథిలమైన రెండు బాలికల వసతి గృహ భవనాల తొలగింపు నిర్వహణ పనులకు ఈ నెల 20వ తేదీ బహిరంగ వేలం పాటను ఉదయం 11 గంటలకు పాఠశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శోభ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు రూ.10 వేలు ధరావత్తు, రూ.3 వేలు ప్రవేశ రుసుం చెల్లించాలని పేర్కొన్నారు. ది ప్రిన్సిపాల్, ఏపీఆర్ స్కూలు, కమ్మనపల్లి అనే చిరునామా పేరుపై డిడి తీసి ఈ నెల 19వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు పాఠశాలలో అందించాలని సూచించారు. వివరాలకు 8712625057 ఫోన్ నెంబరును సంప్రదించాలని సూచించారు.

సమస్యల పరిష్కారంపై అలసత్వం వద్దు

ఇన్‌చార్జి కలెక్టర్ జి విద్యాధరి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి బాధ్యతతో పపరిష్కరించాలని ఇన్‌చార్జి కలెక్టరు జి విద్యాధరి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గ్రీవెన్స్ హాలులో (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి 254 అర్జీలను స్వీకరించారు. జిల్లా ఇన్‌చార్జి కలెక్టరుతో పాటు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే కార్యక్రమంలో డిఆర్‌వో మోహన్ కుమార్, ఆర్డీవో శ్రీనివాసులు, డిప్యూటీ కలెక్టర్ అనుపమ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ కలెక్టరు మాట్లాడుతూ పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి అధికారులు వాటిని పరిష్కరించేందుకు కృసి చేయాలని, ప్రతీ అర్జీకి అర్ధవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కరించాలని ప్రతీ అర్జీని ఆడిటింగ్ చేస్తారన్నారు. ప్రజల నుండి అందే ప్రతి అర్జీని త్వరితగతిన పరిష్కరించాలని, అర్జీల పరిష్కారంలో క్షేత్ర స్థాయిలో అధికారులు సిబ్బందితో సమన్వయం చేసుకుని అర్ధవంతమైన సమాధానాలు ఇవ్వాలన్నారు.

254 అర్జీలు

రెవెన్యూ, సర్వే శాఖ 187, పోలీస్ 13, పంచాయతీరాజ్ శాఖ 1, డి ఆర్ డి ఏ 29, రూరల్ వాటర్ సప్లై 1, డిస్టిక్ రిజిస్ట్రార్ 1, డీ ఎస్ ఓ 3, సెరికల్చర్ 1, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ 3 అర్జీలు అందాయి. డీఈవో 8, హార్టికల్చర్ 2, డిసిసి బ్యాంక్ 1, ఇరిగేషన్ 1, ఏపీఐఐసీ 1, హౌసింగ్ 1, ఎంపీడీవో చిత్తూరు 1, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులు వినతులు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్, డిఆర్ఓ ,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు చిత్తూరు ఆర్డీవోలకు అందించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ విద్యాధరి

శిశు మరణాలు లేని సమాజం నిర్మిద్దాం

జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ విద్యాధరి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: శిశు మరణాలు లేని సమాజం నిర్మిద్దామని ఇన్‌చార్జి కలెక్టర్ జి విద్యాధరి పిలుపు నిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ తరపున నిర్వహిస్తున్న స్టాప్ డయేరియల్ క్యాంపెయిన్ ప్రోగ్రాం పోస్టర్లను ఇన్‌చార్జి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ డిటి సుధారాణి, నోడల్ అధికారి డాక్టర్ హనుమంతరావు సంయుక్తంగా నిర్వహిస్తున్న 'ఇంటెన్సిఫైడ్ డయేరియల్ కంట్రోల్ ఫోర్ట్ నైట్' (ఐడిసిఎఫ్) శిశు మరణాల నివారణే ఈ కార్యక్రమం ఉద్దేశం అన్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ 0-5 సంవత్సరాల లోపు పిల్లలు అందరిని ఏఎన్ఎం, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఇంటింటి సర్వే నిర్వహించి పిల్లల జాబితా తయారుచేసి తల్లిదండ్రులందరికీ ఈనెల 16 నుంచి జులై 31వ తేదీ వరకు ఈ కార్యక్రమం ద్వారా ప్రజలందరికీ అవగాహన కల్పించాలని సూచించారు. అందరి పిల్లలకు రోట వాక్సినేషన్ తప్పక వేయించుకోవాలని తెలిపాలి. అన్ని పిహెచ్‌సిలు, హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు, అంగన్‌వాడీ కేంద్రాలలో ఓఆర్ఎస్ కార్నర్ తప్పకుండా పెట్టించాలన్నారు. ఎవరైనా అనుమానిత పిల్లలకు డయేరియా లక్షణాలు ఉంటే వెంటనే ఓఆర్ఎస్, జింక్ మాత్రలతో చికిత్స ప్రారంభించి 14 రోజులు విరామం లేకుండా ఇస్తే బిడ్డకు భవిష్యత్తులో డయేరియా రాకుండా ఉంటుందన్నారు. అందరూ లైన్ డిపార్టుమెంటుతో కలిసి 'స్టాప్ డయేరియా క్యాంపెయిన్-2025' ద్వారా విజయవంతం చేయాలన్నారు. శిశు మరణాలు లేని సమాజం నిర్మించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ విద్యాధరి

గజరాజుల స్వైరవిహారం

నష్టపోయిన మామిడి చెట్లను పరిశీలిస్తున్నదృశ్యం

ప్రజాశక్తి -గంగవరం, పలమనేరు రూరల్ : పలమనేరు రూరల్ మండలం లోని మొసలి మడుగు గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి అడవిలో నుంచి వచ్చిన ఏనుగుల గుంపు మామి తోటను ధ్వంసం చేసి అపార నష్టం కలిగించాయి. మొసలి మడుగు గ్రామ సమీపంలో ఆ గ్రామానికి చెందిన ఉమాపతి నాయుడు అనే రైతుకు చెందిన కోత దశలో ఉన్న ఐదు ఎకరాల

మామిడి తోటలు ధ్వంసం

మామిడి తోటలోకి ప్రవేశించి కోత దశలో ఉన్న నాలుగు ఎకరాల్లో మామిడి కొమ్మలను విరిచి అందులోని కాయలను తిని చిగిలిన కాయలను నేలపాలు చేసి కాళ్లతో తొక్కి పూర్తిగా నష్టం కలిగించాయి. ఎండకు, వర్షానికి రక్షణగా వేసుకున్న చిన్న గుడిసెను ధ్వంసం చేశాయి. ఈ నష్టమైన నాలుగు ఎకరాల మామిడి తోటకు సుమారు 5 లక్షల రూపాయలు నష్టం వచ్చిందని రైతు ఆవేదనతో వాపోయారు. పక్కనున్న రైతు గిరిజ అనే రైతు పొలంలో వేసిన వరి మడిని తొక్కి, అక్కడున్న కొబ్బరి చెట్లను విరిచేసి నష్టం కలిగించింది. ఈ విషయాన్ని అటవీ శాఖ అధికారులకు తెలిసిన వెంటనే ఫారెస్ట్ రమేష్, బీట్ ఆఫీసర్ యుగంధర్ వచ్చి ఏనుగుల వల్ల నష్టపోయిన మామిడి, ఇతర తోటను పరిశీలించి రైతులకు నష్టమైన పంటలను ప్రభుత్వానికి పంపి ప్రభుత్వం ద్వారా రైతులకు తగిన నష్టపరిహారం తప్పక ఇప్పిస్తామని రైతులకు సర్ది చెప్పి పరిహారం పత్రాన్ని రైతులకు అందించారు. రైతులు పంటపెట్టుబడులకు లక్షలాది రూపాయలు అప్పులు చేసి వేసిన పంటలు చేతికొచ్చే సమయంలో ప్రతి ఏటా ఏనుగుల వల్ల వేసిన పంటలు పూర్తిగా నష్టపోవాల్సి వస్తోందన్నారు. ఇటీవల ఏనుగులు రాలేదు.. కానీ ప్రస్తుతం మామిడి సీజన్ కావడంతో ఇప్పుడు మళ్లీ మొదలయ్యాయి. వారం రోజులుగా ఏదో ఒక చోట నష్టం చేస్తున్నాయని అటవీ శాఖ అధికారులు వారి సిబ్బంది కూడా నిత్యం పొలాల వద్ద ఉంటున్నా మరోవైపు వస్తున్నాయి. రాత్రి కూడా ఇందిరానగర్ వైపు వస్తాయని అక్కడ నిఘా ఉన్నారు కానీ మరోవైపు నుంచి వచ్చిన ఏనుగులను గమనించ లేకపోయారు. కానీ మామిడి కోతల సీజన్లో రాత్రి వేళ్లలోనూ ఏనుగులు మళ్లీ వచ్చి నష్ట పరుస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకపై ఏనుగులు పంటపొలాలపై రాకుండా వాటిని అదుపు చేసి అడవికి ఆనుకుని వున్న ప్రాంతాల్లో సోలార్ ఫెన్సింగ్ వెంటనే ఏర్పాటు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

మామిడిని కొనుగోలు చేయండి

- పర్మిట్లు ఆలస్యంపై రైతుల ఆగ్రహం
- జాతీయ రహదారిపై నిరసన

ఏడాది పాటు అష్ట కష్టాలు పడి పండించిన మామిడి కళ్ల ఎదుటే రాలిపోవడం, గుజ్జు పరిశ్రమల వద్ద రోజుల తరబడి పడిగాపులను నిరసిస్తూ సోమవారం బంగారుపాళ్యం మండలం నల్లగాంపల్లి సన్ గోల్డ్ మామిడి గుజ్జు పరిశ్రమ ఎదుట చెన్నై - బెంగళూరు జాతీయ రహదారిపై మామిడి రైతులు ప్రభుత్వ తీరును నిరసిస్తూ బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు... (వార్త మెయిన్‌లో)

నిరసన వ్యక్తం చేస్తున్న మామిడి రైతులు

అనారోగ్యంతో ఉపాధ్యాయుడు మృతి

ఉపాధ్యాయుడు గౌస్‌బాషా (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి -వికోట : మండల కేంద్రమైన వి కోటలో అనారోగ్యంతో ఉపాధ్యాయుడు మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. మండల పరిధిలోని కుదవగడ్డ ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న గౌస్ బాషా గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఇటీవల ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా గౌస్ బాషా కుదవగడ్డ నుండి వికోట సమీపంలోని చౌడేపల్లి పాఠశాలకు బదిలీ అయ్యారు. సోమవారం నూతన పాఠశాలలో విధుల్లో చేరేందుకు బయలుదేరుతున్న సమయంలో అకస్మాత్తుగా ఇంటిలో కుప్పకూలి కింద పడడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే గౌస్ బాషా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు వున్నారు. ఈ విషయం తెలియడంతో మండల ఎంఈవో చంద్రశేఖర్, ఇతర ఉపాధ్యాయులు మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

'వెన్నుపోటు' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : అబద్ధపు హామీలతో, అసత్యపు ఆరోపణలతో ఆంధ్ర ప్రజలను మభ్యపెట్టి గద్దెనెక్కిన చంద్రబాబు ప్రజలను నట్టేట ముంచిన తీరును ఎండగడుతూ వైసిపి అధిష్టానం రూపొందించిన 'వెన్నుపోటు' పుస్తకాన్ని వైసిపి చిత్తూరు ఇన్‌చార్జ్ ఎంసీ విజయానంద రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఎన్నికల వేల గత వైసిపి ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలను కొనసాగించడమే కాకుండా కొత్తగా సూపర్స్ సిక్స్ కూడా అమలుపరుస్తానని అసత్యపు హామీలను గుప్పించి ఓట్లు దండుకున్న తీరుని ఈ పుస్తకం ద్వారా వివరించామని విజయానందరెడ్డి అన్నారు. అంతే కాకుండా సిఎం కుర్చీలో కూర్చున్న నాటి నుండి ప్రశ్నించిన ప్రతి గొంతును నొక్కే విధంగా భౌతిక దాడులు, అక్రమ అరెస్టులతో రాష్ట్రంలో సామాన్య ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న చంద్రబాబు తీరును ప్రజలముందు ఉంచటానికే ఈ అక్షర పోరాటమని లిఎంసీ విజయానంద రెడ్డిలి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు ఉప మేయర్ చంద్రశేఖర్ , కేపీ శ్రీధర్ , జ్ఞాన జగదీష్, గాయత్రీదేవి, హరిణిరెడ్డి, అంజలీరెడ్డి, సరళామేరి, లక్ష్మణస్వామి , నారాయణమూర్తి, మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపిడివో బి కృష్ణమోహన్‌రెడ్డి

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు మండల ఎంపీడీవో బి కృష్ణమహేష్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పాల సముద్రం నుండి బదిలీపై గంగాధర నెల్లూరుకు వచ్చారు. గతంలో గంగాధర నెల్లూరు ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న సతీష్ బదిలీపై పాలసముద్రం మండలానికి వెళ్లారు.

అమ్మ వారికి పొంగళ్లు

ప్రజాశక్తి -వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం మహాభారతం తిరుణాలలో సోమవారం చివరి రోజు ఈ నేపథ్యంలో ఎర్రగుంట, గోవింద వారి పల్లి గ్రామాలకు చెందిన మహిళలు అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించి, ముక్కు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామస్తులు, మహిళలు తరలివచ్చారు. బాణాసంచా పెద్ద ఎత్తున పేల్చి భక్తిని చాటుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, సానికులు, పెద్దలు పాల్గొన్నారు.

ఐరాల తహశీల్దారుగా బాధ్యతలు స్వీకరిస్తున్న లోకేశ్వరి

ఐరాల తహశీల్దారుగా లోకేశ్వరి

ప్రజాశక్తి -ఐరాల: సాధారణ బదిలీలలో భాగంగా ఐరాల మండలం తహశీల్దారుగా లోకేశ్వరి సోమవారం బాధ్యత లు స్వీకరించారు. ఈమె గతంలో చిత్తూరు రూరల్ మండలం తహశీల్దా రుగా పనిచేస్తూ ప్రస్తుతం ఐరాల మండల తహశీల్దా రుగా బాధితులు స్వీకరించారు. మండలంలోని రెవెన్యూ సమస్యలను త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు చేపడతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేష్ కుమార్, వీఆర్వోలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

బీసీల సభను జయప్రదం చేయండి

పూలే అంబేద్కర్ ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ పరసారత్నం

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: బీసీ సభలను జయప్రదం చేయాలని పూలే అంబేద్కర్ ఫౌండేషన్ అధ్యక్షులు, మాజీ మంత్రి పరసారత్నం పేర్కొన్నారు. మండల కేంద్రం బీసీ సంక్షేమ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 22వ తేదీ తిరుపతిలో బీసీ ఆత్మగౌరవ సభను చేపడుతున్నామని ప్రతి బీసీలు ఈ సమావేశానికి హాజరై బీసీల ఐక్యత చూపాలన్నారు. ఆంధ్ర ప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం, అంబేద్కర్ పూలే ఆధ్వర్యంలో బీసీల ఆత్మగౌర భరోసా నిర్వహిస్తామని ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని బీసీమంత్రులు హాజరవుతారని 22వ తేదీ నిర్వహించే కార్యక్రమానికి బీసీలు తరలిరావాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ జాతీయ నాయకులు ఆల్మన్ రాజ్, తిరుపతి జిల్లా బీసీ అధ్యక్షుడు కల్లూరు నాగరాజుగౌడ్, జానపద వృత్తి కళాకారుల జాతి అధ్యక్షుడు యాదగిరి, ఏపీ ఎఫ్ కన్వీనర్ రఘునాథ్ సింగ్, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు నాగరాజుగౌడ్, నీరజక్షలు గౌడ్, మురళి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిన్నయ్య పాల్గొన్నారు.

ఘనంగా కన్నన్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -కుప్పం రూరల్ : టిడిపి నాయకులు, కుప్పం నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు కన్నన్ జన్మదిన వేడుకలను కుప్పం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం శాలువతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక టిడిపి నాయకులు, కడా కమిటీ సభ్యులు డాక్టర్ సురేష్ బాబు ఆధ్వర్యంలో కన్నన్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. శాలువాతో సన్మానించి, కేక్ కట్ చేసి అభిమానులకు పంచి పెట్టారు.

ఘనంగా గంగ జాతర

ప్రజాశక్తి-సోమల: సోమల మండలం పెద్ద ఉప్పరపల్లె గ్రామంలో ఆది, సోమ వారాలలో నిర్వహించిన గంగ జాతర ఘనంగా సోమవారం రాత్రి అమ్మవారి నిమజ్జనంతో ముగిసింది. ఆదివారం రాత్రి అమ్మవారిని ఊరేగింపుగా తీసుకువచ్చి బలిజ వీధిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చలువ పందిళ్ళ కింద ప్రతిష్టించారు. సోమవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పొంగళ్లు, బోనాలు సమర్పించి మహిళలు మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ఏడు గంటల నుండి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగించి గ్రామ సమీపంలోని చెరువులో అమ్మవారి మట్టి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. పెద్ద ఉప్పరపల్లి గంగ జాతర సందర్భం గా భక్తులు పాల్గొన్నారు.

కనికరించని పరిశ్రమలు

- మామిడి కాయల లోడ్‌లతో రైతుల నిరీక్షణ
- వాహనాల్లోనే ఆహారం, నిద్ర
- స్పందించని ప్రభుత్వం

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: పర్మిట్ల కోసం మామిడి రైతులు రోజుల తరబడి పరిశ్రమల ఎదుట నిరీక్షిస్తున్నారు. ఇటు వాహనాల్లోనే తిండి, నిద్రపోవాల్సిన దుస్థితి ఏర్పడింది. అయినా ప్రైవేటు పరిశ్రమల నుండి ఎలాంటి ప్రకటన లేకపోవడంతో మామిడి రైతులు దిగులుతో వాహనాల వద్ద పడిగాపులు కాస్తున్నారు.

మండలంలోని 100 గొల్లపల్లి జైన్ మామిడి గుజ్జు ఫ్యాక్టరీ వద్ద రైతులు భారీగా మామిడికాయల రోడ్లతో వందలాది ట్రాక్టర్లు సోమవారం చేరుకున్నాయి. ఈ సందర్భంగా సోమవారం నుంచి పర్మిట్లు లేకుండా ముందస్తు వచ్చిన వారి నుంచి మామిడి కొనుగోలు చేస్తామని యాజమాన్యం ప్రకటించడంతో జిల్లా వ్యాప్తంగా మామిడి సాగు రైతులు ట్రాక్టర్లతో ఫ్యాక్టరీ వద్దకు చేరుకున్నారు. సోమవారం చిత్తూరు -పుత్తూరు జాతీయ రోడ్డుపై భారీగా ట్రాక్టర్లతో తిండి తిప్పలు లేకుండా రైతులు నిరీక్షిస్తున్నారు. ఓ రైతు మామిడి కొనుగోలు పూర్తి కాకపోవడంతో ట్రాక్టర్ ఇంజిన్‌పై నిద్రిస్తూ వుండిపోయారు.

జిడి నెల్లూరులో మామిడి గుజ్జు పరిశ్రమ వద్ద వేచి వున్న మామిడి రైతులు

సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు: ఎస్‌పి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో అందిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోపు ఫిర్యాదుదారుల సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్‌పి మణికంఠ చందోలు ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలపై న్యాయం పొందేలా నిబద్ధతతో పని చేయాలన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు, నేరుగా ఎస్‌పిని అడిషనల్ ఎస్‌పి ఆపరేషన్స్, ఇన్‌చార్జి అడ్మిన్ ఎస్ఆర్ రాజశేఖర రాజు, చిత్తూరు సబ్ డివిజన్ డిఎస్‌పి టి సాయినాథ్‌ని కలిసి తమ సమస్యలు విన్నవించుకున్నారు. ప్రతి ఫిర్యాదును సమగ్రంగా పరిశీలించి, త్వరితగతిన విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేయడమే తమ లక్ష్యం అని ఎస్‌పి అన్నారు. ఈ ఫిర్యాదులపై తక్షణ చర్య తీసుకొని ప్రజలు న్యాయం పొందేలా చూడాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. పోలీసులు ప్రజలకు అందుబాటులో వుండి, వారి సమస్యలను చట్టబద్ధంగా పరిష్కరించాల్సిన బాధ్యత ఉందని ఎస్‌పి మరోసారి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మొత్తం 44 ఫిర్యాదులు అందాయి. సైబర్ క్రైమ్ కు సంబంధించి 1, వేధింపులకు 1, కుటుంబ తగాదాలు 6, వేధింపులు 1, ఇంటి తగాదాలు 3, భర్త వేధింపులు 1, భూ తగాదాలు 14, ప్రేమ వివాహాలు 2, డబ్బు తగాదాలు 12, దారి సమస్యలు 1, ఆస్తి తగాదాలకు సంబంధించి రెండు ఫిర్యాదులు అందాయి.

ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్‌పి మణికంఠ చందోలు

యోగాతో మానసిక శాంతి

ప్రజాశక్తి-కుప్పం రూరల్ : యోగాతో మానసిక శాంతి లభిస్తుందని పలువురు పేర్కొన్నారు. కుప్పం పబ్లిక్ స్కూల్ వేదికగా సోమవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కుప్పం పబ్లిక్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు దమయంతి, కుప్పం జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సుప్రియ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాఠశాల అధ్యక్షురాలు శాంతా నాగరాజు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సత్యేంద్రశేఖర్, సుబ్రమణ్యం, వేలు, రవి, ఇర్ఫాన్, నబి ప్రభుత్వ పరిశీలకులుగా ఆర్ ఓ అధికారి మోహన్ కుమార్, సుష్మ, కల్పన పాల్గొన్నారు.

కుప్పం రూరల్ : కుప్పం పబ్లిక్ స్కూల్ వేదికగా సోమవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కుప్పం పబ్లిక్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు దమయంతి, కుప్పం జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సుప్రియ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాఠశాల అధ్యక్షురాలు శాంతా నాగరాజు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సత్యేంద్రశేఖర్, సుబ్రమణ్యం, వేలు, రవి, ఇర్ఫాన్, నబి ప్రభుత్వ పరిశీలకులుగా ఆర్ ఓ అధికారి మోహన్ కుమార్, సుష్మ, కల్పన పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న జనసేన నాయకులు

ఫీల్డు అసిస్టెంటు తొలగింపు అన్యాయం

జనసేన ఇన్‌చార్జి యుగంధర్ పొన్న

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : ఎగువ కమ్మ కండ్రిక ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేశులును తొలగించడం అన్యాయమని జనసేన ఇన్‌చార్జి యుగంధర్ పొన్న పేర్కొన్నారు. గంగాధర నెల్లూరు నియోజకవర్గం, ఎస్ఆర్ పురం మండలం, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆఫీస్ వద్ద జనసేన మండల అధ్యక్షుడు చిరంజీవి ఆధ్వర్యంలో పత్రికా ప్రతినిధుల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ మాల వెల్ఫేర్ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్, జనసేన జీడీ నెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్ పొన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ యుగంధర్ పొన్న మాట్లాడుతూ... మండలంలో గత పది సంవత్సరాలుగా ఎగువ కమ్మకండ్రిక ఫీల్డ్ అసిస్టెంట్ గా పని చేస్తున్న వెంకటేశులు ను అకారణంగా , అన్యాయంగా తొలగించడాన్ని జనసేన తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఈ పంచాయతీలో టిడిపి అని చెప్పుకొని దామోదరం నాయుడు, వెంకటేశులు నాయుడు, సోమశేఖర్ నాయుడు, మురళి నాయుడు అనువారు ఫీల్డ్ అసిస్టెంట్ గా పని చేయడానికి వీలు లేదని, అనేకమార్లు గొడవలు పడటం, అతని ఇబ్బంది పెట్టడం, అనేక సందర్భాల్లో చేశారని తెలిపారు. ఇక్కడ ఉంటే టిడిపి అయినా ఉండాలి, లేదా జనసేన అయినా ఉండాలని అతని విధులు అనేకమార్లు ఆటంకం కలిగించారని, దురుద్దేశపూర్వకంగా కలెక్టర్‌కి తప్పుడు సమాచారం అందించారని తెలిపారు. అంబేద్కర్ సాక్షిగా ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేషులకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధంగా కులం, మతం, ప్రాంతం, భాషల ప్రాతిపదికన విభజించి చూడటాన్ని పూర్తిగా ఖండిస్తున్నామని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్ కు జరిగిన అన్యాయాన్ని గౌరవ ప్రభుత్వ విప్, కూటమి ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్ దృష్టికి తీసుకెళతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి, శోభన్ బాబు, లతీష్, చార్లెస్, చందు, సురేష్, పవన్, ప్రతాప్, సురేష్ రెడ్డి, చందు, జన సైనికులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

డయేరియా నివారణపై ర్యాలీ

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండలంలోని తీర్థం ఆరోగ్య కేంద్రం డాక్టర్ పద్మావతి ఆధ్వర్యంలో తీర్థం గ్రామంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పద్మావతి మాట్లాడుతూ 'అతిసార నుండి మీపిల్లలను రక్షించండి..' అని ..మీబిడ్డ కు ఒక్కరోజులో 3 లేదా అంత కంటే ఎక్కువగా పలుచగా విరేచనాలు అయితే అప్పుడు దాన్ని అతిసార వ్యాధిగా గుర్తించాలని సూచించారు. ఈ వ్యాధి నివారణకు పిల్లలకు పాలుపట్టేటప్పుడు చేతులను శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలని, మొదటి ఆరు నెలలు తప్పని సరిగా తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, పోషకాహారం తగినంత ఇవ్వాలని సూచించారు. డయేరియా వచ్చినప్పుడు డాక్టర్ సలహా ప్రకారం ఓఆర్ఎస్ , జింక్ ద్రావణం లేదా మాత్రలు వేయాలని కోరారు. హెచ్ ఈ ఓ కాంతమ్మ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచు కోవాలని, వ్యక్తిగత శుభ్రత పాటించాలని, వ్యాధి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. ఈకార్యక్రమంలో ఎస్‌హెచ్ శ్రీదేవి, హరి శ్రీ ప్రసాద్ , రాజారెడ్డి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

దీక్షలు చేపట్టిన మున్సిపల్ ఒప్పంద కార్మికుల దీక్షలు

సమస్యలు పరిష్కరించాలి

మున్సిపల్ ఒప్పంద కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి -పుంగనూరు: మున్సిపాల్టీలో ఒప్పంద కార్మికుల విధులు నిర్వహిస్తున్న వారి దీర్ఘకాలిక సమస్యలు ప్రభుత్వం పరిష్కరించకపోవడంతో నిరసన దీక్షలు చేపట్టారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకుడు రెడ్డిపల్లి శ్రీరాములు మాట్లాడుతూ మున్సిపల్ రంగంలో ఒప్పంద కార్మికులు టెక్నికల్ కు నెలకు రూ.29,200, నాన్ టెక్నికల్ సిబ్బందికి రూ .24,500లు వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్ల తరబడి సమస్యల పరిష్కారం కోసం వివిధ రూపాల్లో ఆందోళన చేస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడం విచారించదగ్గ విషయం అన్నారు. ఒప్పంద కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద రిటైర్డ్ అయిన కార్మికులకు 10 లక్షలు, నెలకు పదివేలు పింఛన్ ఇవ్వాలన్నారు. కారుణ్య నియామకాలు అమలు చేయాలన్నారు. రిటైర్డ్ అయిన కార్మికులకు గ్రాడ్యుటి ఇవ్వాలన్నారు. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు నిరసన దీక్షలు చేపడుతున్నామన్నారు. దీక్షలు 21 వరకు చేస్తూ, 22 నుంచి రిలే నిరాహార దీక్షలు చేపడతామన్నారు. కార్యక్రమంలో శ్రీకాంత్ రెడ్డి, చంద్ర, సురేష్, సూర్యనారాయణ, సుదర్శన్ రాజు,దౌలత్, చెన్నకేశవులు, గోపాలకృష్ణమూర్తి, లక్ష్మణ్ కుమార్, రమేష్ బాబు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-పలమనేరు: కూటమి ప్రభుత్వ ఏడాది పాలనా వైఫల్యాలపై వైసీపీ రూ పొందించిన పుస్తకాన్ని పలమనేరు వైసిపి కార్యాల యంలో పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి పాలనను ప్రజలు వైయస్ జగన్ ఏడాది పాలనతో పోల్చి చూస్తున్నారన్నారు. వాస్తవాలు తెలుసుకునేందుకు ప్రజలకు అందుబాటులో ఈ పుస్తకం ఉంచుతామని వెంకటే గౌడ తెలిపారు. చంద్రబాబు నేతృత్వంలో ఏడాది క్రితం ఏర్పడిన కూటమి ప్రభుత్వం తన పాలనతో ప్రజలకు చీకటి రోజులను మిగిల్చిందని, చంద్రబాబు ఆయన తనయుడు లోకేష్‌లు రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో ఒక అరాచకాన్ని సృష్టించారన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ అనుబంధం విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

అరెస్టయిన నిందితులు

ఆటో దొంగలు అరెస్ట్

ఆటో విడిభాగాలు స్వాధీనం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: చిత్తూరు పట్టణ పరిసర ప్రాంతాలలో ఆటోల దొంగతనానికి పాల్పడిని తిరుపతికి చెందిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుండి అపహరించిన సుమారు రూ. 10లక్షల50 వేలు రూపాయలు విలువ కలిగిన మూడు ఆటోలు, ఆటో విడి భాగాలు స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. చిత్తూరు ఒన్ టౌన్, టు టౌన్ పరిధిలో వివిధ ప్రాంతాలలో ఆటోలు దొంగతనానికి గురవుతున్నాయని తెలుసుకున్న చిత్తూరు ఎస్‌పి మణికంఠ చందోలు పర్యవేక్షణలో, చిత్తూరు డిఎస్‌పి సాయినాథ్, చిత్తూరు 1 టౌన్ సీఐ మహేశ్వర, ఎస్ఐ శ్రీనివాసులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం చిత్తూరు డిఎస్‌పి సాయినాథ్ పర్యవేక్షణలో చిత్తూరు 1 టౌన్ సిఐ ఎం మహేశ్వర కి అందిన సమాచారం మేరకు చిత్తూరు వన్ టౌన్ ఎస్ఐ శ్రీనివాసులు చిత్తూరు 1 ఎస్ఐ టౌన్ 2 టౌన్ సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి చిత్తూరు

పట్టణం, కట్టమంచి వద్ద ఎ 1 కొండల ఆదినారాయణ పోలీసుల అదుపులోకి తీసుకొని విచారించగా అతను ఎ 2 చిన్నంగారి షణ్ముగం అతనితో కలిసి ఆటోలు దొంగతనం చేశారని తెలుపగా మరొక బృందం తిరుపతి జీవకోనలో చిన్నంగారి షణ్ముగంను అదుపులోకి తీసుకుని వారి ఇద్దరి వద్ద మూడు ఆటోలు, ఆటో విడి పరికరాలు స్వాధీనం చేసుకున్నారు. మూడు ఆటోలు, ఆటో విడి భాగాల విలువ సుమారు పది లక్షలా 50 వేల రూపాయలు వుంటుందన్నారు. వాటిని స్వాధీనం చేసుకుని నిందిత లను ఇద్దరిని రిమాండుకు తరలించారు. వారిని పట్టుకునేందుకు కృషి చేసిన పోలీసు ఆఫీసర్లు, ఐడి పార్టీ సిబ్బందిని ఎస్‌పి మణికంఠ చందోలు, చిత్తూరు డిఎస్‌పి సాయినాథ్ ప్రత్యేకంగా అభినం దించారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-తవణంపల్లి: ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. కాణిపాకానికి చెందిన భక్తవత్సలం ద్విచక్ర వాహనంలో సత్తారు బాయ్ వద్ద వస్తుండగా వెనుక నుండి వేగంగా వచ్చిన కారు ఢీకొంది. దీంతో వాహన చోదకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సాయంతో 108 ద్వారా చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ప్రస్తుతం పరిస్థితి విషమంగా ఉంది. పూర్తి వివరాలు తెలియాల్సి వుంది తవణంపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

'తల్లికి వందనం' అమలుపై హర్షం

ప్రజాశక్తి -వికోట : మండల పరిధిలోని పెద్ద బర్నేపల్లి ప్రభుత్వ పాఠశాలలో తల్లికి వందనం కార్యక్రమంలో భాగంగా ప్రతి విద్యార్థి తల్లుల ఖాతాలో డబ్బులు జమ చేయడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాలాభిషేకం చేసి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల టిడిపి అధ్యక్షులు ఏఎం రంగనాథ్ మాట్లాడుతూ ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం పథకం ద్వారా ప్రతి విద్యార్థి తల్లుల ఖాతాలో 13 వేల రూపాయలు జమ చేశారన్నారు. రానున్న కాలంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి రాంబాబు, యూత్ అధ్యక్షుడు ధీరజ్, విశ్వనాథ్‌రెడ్డి, గ్రామస్తులు, తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల నిరసన

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో కార్యాలయం వద్ద వికోట, బైరెడ్డిపల్లి మండలాలు అంగన్‌వాడీ సిబ్బంది ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమను ప్రభుత్వ ఉద్యోగులుగా నైనా గుర్తించాలని, లేదంటే ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ వెంకటరత్నమ్మ, శకుంతలమ్మ, తిప్పక్క, సరోజ, వికోట, బైరెడ్డిపల్లి మండలం అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రధానమంత్రి సూర్యఘర్'ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : పర్యావరణ పరిరక్షణ కోసం సంప్రదాయ ఇంధన వనరులను విరివిగా వినియోగించుకోవడంలో భాగంగా ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పిలుపునిచ్చారు. సోమవారం లక్ష్మీ నగర్ కాలనీలోని ఎమ్మెల్యే వారి కార్యాలయం ప్రజాదర్బార్ లో 'ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన'పై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంప్రదాయేతర బొగ్గు, నీటి నుండి విద్యుత్ తయారు చేయడం ఖర్చుతో కూడుకున్న వ్యవహారం అని, కాలుష్యం పెరుగుతుందన్నారు. కాలుష్యాన్ని తగ్గించడం కోసమే ఇటీవల ఈ-ఆటోలు, ఈ-స్కూటర్లను పంపిణీ చేసినట్లు గుర్తు చేశారు. కాలుష్యాన్ని నియంత్రించడం, సంప్రదాయ ఇంధన వనరులను సద్వినియోగం చేసుకోవడంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రాయితీలతో పాటు బ్యాంకు రుణాలు అందుబాటులో ఉన్నాయన్నారు. సూర్యఘర్ పథకంపై ట్రాన్స్ కో ఏడీఈ ఆనంద్, ఏడీ సుబ్రహ్మణ్య ప్రసాద్ లు అవగాహన కల్పించారు. ప్రజల సందేహాలను నివృత్తి చేశారు. సూర్యఘర్ పథకంలో భాగంగా సొంత గృహాలపై సోలార్ ప్యానల్‌ను ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవడంతో పాటు, ప్రభుత్వానికి విద్యుత్తును అందించి లాభాలు పొందవచ్చన్నారు. ఈ సందర్భంగా సూర్యఘర్ యోజన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మేయర్ ఎస్ అముద, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, కార్పొరేటర్ అశోక్, బిజెపి ప్రధాన కార్యదర్శి అట్లూరి శ్రీనివాసులు, స్థానిక నాయకులు, డివిజన్ ఇన్‌చార్జులు పాల్గొన్నారు.



విజయాలకు పునాది నేషనల్ పబ్లిక్ స్కూలు

యజమానులే ఉపాధ్యాయులు

ప్రజాశక్తి -గంగవరం: విద్యార్థులు విజయాలకు పునాది పాఠశాల విద్య.. అయితే తమ నేషనల్ పబ్లిక్ స్కూలు మీ తెలివైన ఎంపిక అవుతుందని, ఇక్కడ యజమానులే ఉపాధ్యాయులుగా విద్యా బోధన చేస్తున్న ఏకైక స్కూలు నేషనల్ పబ్లిక్ స్కూలు అని ఆ స్కూలు కరస్పాండెంట్ ప్రమోద్ కుమార్ తెలిపా రు. మండల కేంద్రం గంగవరం కీలపట్ల క్రాస్‌లో నూతనంగా నిర్మించిన పబ్లిక్ స్కూల్లో అన్ని మౌలిక వసతులు , విశాల మైన క్రీడా మైదా నం, నూతనటెక్నా లజీతో మరుగు దొడ్లు, ఆట వస్తువులు, వీటి పోటీ ప్రపంచాన్ని కను గొనగా అన్ని సౌకర్యాలతో విద్యార్థినులే ధ్యేయంగా ఏర్పరచిన పాఠశాల.. బట్టీలతో మార్కులు రావచ్చేమో కాని జీవితంలో గెలవాలంటే అవసరమయ్యే వ్యక్తిత్వ నిర్మాణంతో కలిసి వ్యవస్థగా ఏర్పాటు చేసిన పాఠశాల అని, కాన్సెప్ట్ బేస్డ్ ఎడ్యుకేషన్ లో భాగంగా ఆరో తరగతి నుండి ఐఐటి, నీట్‌లలో అత్యుత్తమ శిక్షణ. .చదువుతో పాటు కళలు, నృత్యం, పాటలు వంటి వాటితో ప్రావీణ్యత, ఎన్‌సిసిల సౌకర్యం కూడా ఉందని తెలిపారు. పరిశీనాత్మక, ఆచరణాత్మక విజయంతో గణనీ యమైన విద్యా బోధన, ప్రతి విద్యార్థి మీద ప్రత్యేక శ్రద్ధతో వారు పయనించేలా ఉత్తేజ పరచడం, కాన్సిస్టెంట్ స్టూడెంట్ కన్సల్టింగ్ అండ్ మోటివేషన్ సీజన్స్ లాంటివి అన్నీ ఉన్నాయని పేర్కొన్నారు. దీంతో పాటు అనుభవం ఉన్న ఉపాధ్యాయులతో శిక్షణలతో కూడిన తమ పాఠశాలలో తల్లిదండ్రులు విద్యార్థులను చేర్చాలని ఇప్పటికే అడ్మిషన్లు ప్రారంభించామన్నారు. తమ పాఠశాల లో కేజీ నుండి టెన్త్ క్లాస్ వరకు అనుభవం వున్న ఉపాధ్యాయులు బోధిస్తారన్నారు.

నేషనల్ పబ్లిక్ స్కూలు భవనం

నూతన టెక్నాలజీతో నిర్మించిన పాఠశాల గది

పాఠశాలలో ఆటల భవనం

కరస్పాండెంట్ ప్రమోద్‌కుమార్